# హరితహారం ప్రగతికి సోపానం

- వనాలతోనే వర్షాలు అధికమనేది తేటతెల్లం
- మొక్కలను కన్నబిడ్డల వలె కాపాడుకుంటేనే భవిష్యత్తు
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- మైలారంలో ఘనంగా తెలంగాణ హరితోత్సవం
- కలెక్టర్ ప్రావీణ్య, డీఎఫ్‌వో వసంత హాజరు



మైలారం హరితోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి, జూన్ 19 : హరితహారం ప్రగతికి సోపానం అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో మండలంలోని మైలారం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సమీపంలో డీఎఫ్‌వో వసంత సారథ్యంలో తెలంగాణ హరితోత్సవం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు వరంగల్ కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి ముఖ్యఅతిథిగా మంత్రి ఎర్రబెల్లి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అటవీశాఖాధికారులు, ప్రభుత్వ అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులతో కలసి సర్పంచ్ లేతాకుల సుమతీ యాదవరెడ్డి నేతృత్వంలో ఏర్పాటు చేసిన తెలంగాణ దశాబ్ది సంపద వనంలో మొక్కలు నాటారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తెలంగాణకు హరితహారం కార్యక్రమాలు రాష్ట్రంలో పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ఎంతగానో ఉపకరిస్తున్నట్లు చెప్పారు. గతతంలో రాష్ట్రంలో అడవుల విస్తీర్ణం తగ్గిపోవడంతో తీవ్ర వర్షాభావ పరిస్థితి ఏర్పడిందన్నారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ ఆలోచనతో హరితహారం ప్రవేశపెట్టి, రాష్ట్రవ్యాప్తంగా ఏటా మొక్కలు నాటి, సంరక్షించడంతో అడవుల విస్తీర్ణం క్రమంగా పెరుగుతున్నట్లు వివరించారు. దీంతో పదేళ్లుగా రాష్ట్రంలో వర్షాలు విస్తారంగా కురుస్తున్న విషయం ప్రజలకు తేటతెల్లమైందన్నారు. వన మహోత్సవాలు, తెలంగాణకు హరితహారం కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో నాటుతున్న మొక్కలన్నింటిని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ప్రజలు కాపాడాలని, వృక్షాలను సంరక్షిస్తేనే భవిష్యత్‌తరాలకు మనుగడ ఉంటుందన్నారు.

**దేశమే అబ్బురపడేలా గ్రీన్ ఫండ్**

రాష్ట్రంలో పచ్చదనం, మొక్కల పెంపకం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభు త్వ అధికారులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధుల వేతనాల నుంచి శాశ్వత గ్రీన్ ఫండ్‌ను ఏర్పాటు చేశారన్నా రు. అంతేగాక ప్రభుత్వ నిర్వహణలో జరిగే కాంట్రాక్ట్‌లు, పనులన్నింటిలోనూ గ్రీన్ ఫండ్, గ్రీనరీల కోసం కొంత భాగాన్ని కేటాయించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మొక్కల సంరక్షణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం తెలంగాణకు హరితహారం–తెలంగాణ హరితోత్సవాలపై జిల్లా అటవీశాఖ నేతృత్వంలో ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాలను మంత్రి ఆవిష్కరించారు. మొక్కలు నాటుతామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాల్లో డీఆర్‌డీవో మిట్టపల్లి సంపత్‌రావు, ఎఫ్‌ఆర్‌వో సదానందం, డీఆర్‌వో కర్ణానాయక్, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జడ్పీటీసీ రంగు కుమార్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బిల్ల సుధీర్‌రెడ్డి, నాయకులు పూస మధు, గాడిపల్లి వెంకన్న, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ కుసుమ సత్యనారాయణ, ఎంపీడీవో గుగులోతు కిషన్‌నాయక్, ఎంపీవో తుల రామ్మోహన్, ఏవో గుమ్మడి వీరభద్రం, ఏపీవో దొణికెల కుమార్‌గౌడ్, ఏపీఎం పులుసు అశోక్‌కుమార్, గిర్దావర్ కొయ్యాడ చంద్రమోహన్, ఇరిగేషన్ శాఖ డీఈ కిరణ్ కుమార్, ఏఈ బాలదాస్, అనూష, పీఆర్ డీఈ వాసం బాబూరావు, ఏఈ కార్తీక్‌రెడ్డి, లాల్‌సింగ్, కిషన్, పంచాయతీ కార్యదర్శి పెంచల విజేందర్, కారోబార్ గూడెల్లి ఉప్పలయ్య, గూడెల్లి వెంకన్న, గబ్బెట బాబు, ఆష్రఫ్ పాష, ఎల్లస్వామి పాల్గొన్నారు.

## కామేశ్వరి అలంకరణలో భద్రకాళి

**శాకంబరీ ఉత్సవాలు ప్రారంభించిన చీఫ్ దాస్యం, ఎమ్మెల్సీ బస్వరాజు**



కామేశ్వరి అలంకరణలో భద్రకాళి అమ్మవారు

వరంగల్, జూన్ 19 : చారిత్రక భద్రకాళి ఆలయంలో శాకంబరీ ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య జ్యోతి ప్రజ్వలన చేసి శాకంబరీ ఉత్సవాలను ప్రారంభించారు. నవరాత్రి ఉత్సవాల తొలి రోజు కామేశ్వరి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయానికి విచ్చేసిన చీఫ్ విప్ దాస్యం, ఎమ్మెల్సీ సారయ్యకు ఈవో శేషుభారతి, ప్రధాన అర్చకుడు శేషు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయ మహా మండపంతో వారికి ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్, ఎమ్మెల్సీ మాట్లాడుతూ అమ్మవారి శాకంబరీ నవరాత్రుల ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలన్నారు. రోజుకో అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున వచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో కొమురవెల్లి దేవస్థాన వేదపడింతులు వేలేటి సిద్ధరామశర్మ, ఆలయ సామవేద పండితులు ప్రదీప్‌కుమార్ శర్మ, ముఖ్య అర్చకులు నర్సింహశర్మ, వెంకట నాగరాజ శర్మ, ఆలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



కమిషనరేట్‌లో పోలీసు అధికారులతో కలిసి మొక్క నాటి, నీళ్లు పోస్తున్న సీపీ రంగనాథ్

## మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత

**హరితోత్సవంలో సీపీ ఏవీ రంగనాథ్**

సుబేదారి, జూన్ 19 : మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. సోమవారం హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో హరితోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అదికారులతో కలిసి సీపీ మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీసీపీలు మురళీధర్, కరుణాకర్, పుష్ప, అదనపు డీసీపీలు సంజీవ్, సురేశ్‌కుమార్, ఏసీపీలు నాగయ్య, సురేందర్, ఆర్‌ఐలు భాస్కర్, నగేశ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్

## ప్రకృతి వనాలతో గ్రామాల వికాసం

- హరితహారంతోనే రాష్ట్రంలో వర్షపాతం పెరిగింది
- మొక్కలతో పల్లెలకు నూతన శోభ
- వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్
- కట్ర్యాలలో దశాబ్ది సంపద వనం ప్రారంభం

వర్ధన్నపేట, జూన్ 19 : పల్లె ప్రకృతి వనాలతో గ్రామాలు అభివృద్ధి చెందాయని, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనలతో చేపట్టిన హరితహారం వల్లే వర్షాలు సమృద్ధిగా కురిసి మెరుగైన వర్షపాతం నమోదవుతుందని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. మండలంలోని కట్ర్యాల గ్రామంలో అటవీశాఖ, ఈజీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హరితహారం సంపద వనాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుజ్జ సంపత్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే అరూరి మాట్లాడుతూ గత సమైక్య రాష్ట్రంలో తెలంగాణలో వృక్షసంపద గణనీయంగా తగ్గిపోయి గ్రామాలు ఎడారులుగా కనిపించేవన్నారు. కానీ, తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రజల ఆశీస్సులతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. 8 సంవత్సరాలుగా ప్రత్యేకంగా గ్రామానికి ఒకటి చొప్పున నర్సరీలను ఏర్పాటు చేసి, నాణ్యమైన మొక్కలను పెంచి, నాటించినట్లు చెప్పారు. దీని వల్ల గ్రామాలు మొక్కలతో ఆహ్లాదకరంగా మారాయన్నారు. అంతేకాక తెలంగాణలో 33 శాతం అటవీ సంపద పెరిగి వర్షాభావ పరిస్థితులు కూడా తగ్గిపోయి, క్రమంగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. వాతావరణ సమతుల్యత ఏర్పడి మెరుగైన వర్షపాతం నమోదవుతుండడంతో రైతులు సమృద్ధిగా పంటలు పండించుకుంటున్నారని వివరించారు. హరితహారంలో అన్ని విభాగాల ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు అన్ని వర్గాల ప్రజలు కూడా పాల్గొని, పెద్ద సంఖ్యలో మొక్కలు నాటడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. అలాగే, త్వరలో వర్షాలు కురవగానే 9వ విడుత హరితహారం ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఇప్పటికే గ్రామాల్లో హరితవనాలు, పల్లెప్రకృతి వనాలతో గ్రామాలు ఎంతో పచ్చదనంగా కనిపిస్తున్నాయన్నారు. వచ్చే హరితహారంలో కూడా పెద్ద సంఖ్యలో మొక్కలు నాటించేందుకు అధికారులు విస్తృతంగా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో ఎం సంపత్‌రావు, ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సదానందం, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఏపీవో నాగేశ్వర్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ఆకుపచ్చ తెలంగాణే సర్కారు లక్ష్యం

- హరితహారంతో పెరిగిన అటవీ విస్తీర్ణం
- ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి
- చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్
- హంటర్ రోడ్డులోని కాకతీయ జూపార్కులో హరితోత్సవం
- హాజరైన కలెక్టర్, మేయర్, గ్రేటర్ కమిషనర్



విజేతలకు ప్రశంసా పత్రం అందజేస్తున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్

హనుమకొండ, జూన్ 19 : ఆకుపచ్చ తెలంగాణే బీఆర్ఎస్ సర్కారు లక్ష్యమని, తెలంగాణ ఏర్పాటు అనంతరం అటవీ విస్తీర్ణం పెరిగిందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హనుమకొండ జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో డీఎఫ్‌వో వసంత అధ్యక్షతన హనుమకొండ హంటర్ రోడ్డులోని కాకతీయ జూ పార్కులో సోమవారం హరితోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా చీఫ్‌విప్‌తో పాటు మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, నగర కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపార్కులో మొక్కలు నాటారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు అతిథులకు మొక్కలు అందజేశారు. అనంతరం చీఫ్ విప్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పచ్చదనం పెంచాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంతో అటవీ విస్తీర్ణం పెరిగిందన్నారు. ప్రకృతిని రక్షించాలని, రానున్న తరాలకు పచ్చని తెలంగాణను అందించాలన్నారు. ఇందుకుగాను గ్రామాల్లో, పట్టణ ప్రాంతాల్లో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచడంతో పాటు పల్లె ప్రకృతి వనాలు, పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేసినట్లు చీఫ్ విప్ తెలిపారు. చెరువులను పరిరక్షించడంతోపాటు బంధం చెరువు, భద్రకాళీ చెరువు లాంటి ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని కలెక్టర్, నగర కమిషనర్, అటవీ శాఖ అధికారులకు చీఫ్ విప్ సూచించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిక్షణకు పాటుపడాలని కోరారు. మేయర్, కలెక్టర్, నగర కమిషనర్, కుడా చైర్మన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెట్లు నాటి రక్షించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, అతిథులతో హరిత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. వివిధ పాఠశాలల విద్యార్థులకు పలు అంశాలపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్, మైనార్టీ కార్పొరేషన్ సభ్యుడు దర్శన్‌సింగ్, కార్పొరేటర్లు రావులు కోమలాకిషన్, బోయినపల్లి రంజిత్‌రావు, మామిళ్ల రాజు, ఎనుకంటి రాములు, మాజీ కార్పొరేటర్లు, జూపార్కు ఇన్‌చార్జి వీ రాజు, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

**రీజినల్ సైన్స్ సెంటర్‌లో..**

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హంటర్‌రోడ్డులోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో హరితోత్సవం నిర్వహించినట్లు ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ రాకేశ్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని మొక్కలు నాటినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది ఉచితంగా సైన్స్‌సెంటర్‌ను సందర్శించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ నితీశ్‌రెడ్డి, వీ వెంకటేశ్వర్‌రావు, కీర్తి వివేక్, అనిల్, అశోక్‌కుమార్, రాజయ్య, నాగమణి, రామూనాయక్ పాల్గొన్నారు.